ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
గురువారం 25 జనవరి 2024





ఓటే ఆయుధం

ఓటు ప్రజాస్వామ్యానికి పునాది. ఐదేళ్లకు ఒకసారి వచ్చినా మన తలరాతలు, జీవితాలు మార్చేవి ఎన్నికలే. మనం వేసే ఓటు మన భవిష్యత్తు. రాబోయే తరాల మనుగడను నిర్ణయిస్తాయి. అందుకే ఓటు వజ్రాయుధం వంటిది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలి. మంచి ప్రభుత్వాలను ఎన్నుకునేందుకు ఓటును ఆయుధంగా వాడుకోవాలి. ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు ఏటా జనవరి 25న ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

- ప్రజాస్వామ్యానికి పునాది
- జిల్లాలో పెరిగిన ఓటర్ల సంఖ్య
- 18 ఏళ్లు నిండిన వారు నమోదుకు అవకాశం
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

మంచిర్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామిక భారతదేశంలో కుల, మత, లింగ, వర్గ, ప్రాంతీయ భేదం లేకుండా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ప్రతీ పౌరుడికి ఉంది. ఓటు హక్కు దేశంలో 18 ఏళ్లు నిండిన పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం. ఆ వయసులో పూర్తి స్థాయిలో పరిస్థితులను అర్థం చేసుకొనే అవకాశం ఏర్పడుతున్నందున రాజ్యాంగా 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పించే చర్యలు చేపట్టింది. ఐదేళ్ల మన భవిష్యత్‌ను నిర్ణయించుకొనే ఏకైక అస్త్రం.

ఓటుతో సమర్థవంతుడైన నాయకుడిని ప్రజా ప్రతినిధిగా ఎన్నుకొనే వెసులుబాటు పౌరులకు ఉంది. అదే ఓటుతో అసమర్థులను ఇంటిదారి పట్టించే హక్కు భారత పౌరులు కలిగి ఉన్నారు. ఓటరు దేశ భవిష్యత్‌ను సైతం నిర్ణయించే హక్కుదారు. ఎన్నికలు రాగానే హడావుడి చేసి ఇంటింటా ప్రచారం నిర్వహించే నాయకులు, తదనంతరం ఓటేసిన వారిని విస్మరించే ప్రస్తుత పరిస్థితుల్లో ఓటరు ముఖ్య భూమిక పోషించాల్సిన సమయం. ఓటు వేయడంలో నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా పౌరులు అనామకులను అందల మెక్కించిన వారవుతారు. తాను ఒక్కడినే ఓటు వేయకపోతే ఏమవుతుందనే అభిప్రాయం కూడా అనర్హులకు ఊతం ఇచ్చినట్లవుతుంది. ఓటు హక్కును వినియోగించుకోవడం పౌరుల బాధ్యత. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే దానికి ఉన్న విలువ సార్థకం అవుతుంది.

యువతకు అవగాహన..

యువతకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు 2011 నుంచి ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తోంది. ఎన్నికలంటేనే డబ్బు, మద్యం ఏరులై పారుతున్న రోజులివి. ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తులు ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. నోట్ల కోసం, మద్యం కోసం ఓటు హక్కును దుర్వినియోగం చేసే ఓటర్లూ లేకపోలేదు. ఓటు వేస్తే మాకేంటి అనే ధోరణి కొందరిలో కనిపిస్తుంటుంది.

ప్రజలు వేసే ఓటు తమ ప్రాంతాన్ని ఐదేళ్ల వరకు పాలించే నాయకున్ని ఎన్నుకొనే బ్రహ్మాస్త్రం అనే విషయాన్ని విస్మరించకుండా నిక్కచ్చిగా ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కుకు సంపూర్ణ అర్థం వస్తుంది. నాయకుల ప్రలోభాలకు లొంగకుండా సమ ర్థవంతుడైన నాయకున్ని ఎన్నుకొనే బాధ్యత ప్రతి పౌరునిపై ఉంది. భారత దేశంలో ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఓటు హక్కు, దాని వినియోగంపై పౌరులకు ప్రతి ఏటా అవగాహన కల్పిస్తాయి. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులను ఓటర్లుగా గుర్తించేందుకు జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఎన్నికల సంఘం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నమోదు, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు విలువలపై విద్యార్థులకు పోటీలు సైతం నిర్వహిస్తోంది.

జిల్లాలో 6,42,266 మంది ఓటర్లు..

ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం ప్రకారం 1-1-2024 నాటికి జిల్లాలో 6,42,266 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 3,20,130 మంది ఉండగా స్త్రీలు 3,22,087 మంది ఉన్నారు. వీరితో పాటు ఇతరులు 49 మంది, ఎన్‌ఆర్‌ఐ,సర్వీసు (దేశ భద్రత బలగాలు) ఓటర్లు మరో 631 మంది ఉన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే 55, 580 మంది ఓటర్లు పెరిగారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఒకే ముఖం గల (ఫొటో సిమిలర్ ఎంట్రీస్) వ్యక్తుల జాబితాను అన్ని జిల్లాల కలెక్ట ర్లకు పంపడంతో ఇతర చోట్ల నమోదైన ఓటర్లను స్థానికంగా తొలగించినప్పటికీ కొత్తగా నమోదైన వారితో జిల్లాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది.

నియోజకవర్గాల వారీగా..

చెన్నూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,90,271 మంది ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 94,987 మంది, స్త్రీలు 95,276, ఇతరులు 8 మంది ఉన్నారు. వీరితోపాటు నియోజక వర్గంలో ఎన్‌ఆర్‌ఐ ఓట్లు పురుషులవి 7 ఉండగా, సర్వీస్ ఓటర్లు 134 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 132 మంది, స్త్రీలు 2 గురు ఉన్నారు. బెల్లంపల్లి నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు 1,74,759 మంది ఉన్నారు. పురుషులు 87,215, స్త్రీలు 87,528 మంది, ఇతరులు 16 మంది ఉన్నారు. వీరితోపాటు ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు పురుషులు 2, సర్వీస్ ఓటర్లు 163 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 156, స్త్రీలు 7 గురు ఉన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,77,236 మంది ఉన్నారు. పురుషులు 1,37,928 మంది, స్త్రీలు 1,39,283 మంది, ఇతరులు 25 మంది ఉన్నారు. వీరితో పాటు ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 27 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 21 మంది, స్త్రీలు 6 గురు ఉన్నారు. అలాగే సర్వీసు ఓటర్లు 334 మంది ఉండగా, వీరిలో పురుషులు 325, స్త్రీలు 9 మంది ఉన్నారు.

ఓటు హక్కును పొందాలి.. కలెక్టర్ బదావత్ సంతోష్



అర్హులందరూ ఓటు హక్కును పొందాలి. 18 సంవత్సరాలు నిండగానే రాదు, ఓటరుగా నమోదు చేసుకునప్పుడే ఓటు హక్కు వస్తుంది. ఏటా ఓటరు నమోదు ప్రక్రియ ఉంటుంది. యువత దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎలాంటి ప్రలోభాలకు లోటు కాకుండా ఓటు హక్కు విని యోగించుకోవాలి. ఓటు హక్కుతోపాటు బాధ్యత కూడా. ఆ బాధ్యతని మర్చిపోతే హక్కులు కూడా రావు. ఎన్నికల ముందు ఓటర్లు తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలి.

జాతీయ విపత్తులపై అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 24: జాతీయ విపత్తులు, వాటి వలన ఏర్పడే పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ విపత్తులు సంభవించిన సమయంలో చేపట్టాల్సిన చర్యలు, బాధితులకు అందించాల్సిన తక్షణ సహాయంపై అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీపీఆర్ ద్వారా తక్షణమే వైద్య సహాయం అందించి ప్రాణాలను కాపాడవచ్చు న్నారు. ప్రతి ఒక్కరూసీపీఆర్ విధానం తెలుసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్, మోతిలాల్, ఎన్‌డీఆర్ ఎఫ్ విజయవాడ 10వ పటాలం ఇన్‌స్పెక్టర్ బీటెన్‌సింగ్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, ఏసీపీ తిరుపతిరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, జాతీయ విపత్తుల ప్రతిస్పందన దళం ప్రతినిధులతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 24 : జిల్లాలో గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఓటు లాంటిది ఇంకొకటి లేదు- నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను అనే నినాదంతో ఓటరు ప్రతిజ్ఞ చేయనున్నామని తెలిపారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

నస్పూర్, జనవరి 24: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ భద్రత, బాధ్యతతో కూడిన ప్రయాణం చేయాలని నస్పూర్ ఎస్సై రవి కుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం సీసీసీ కార్నర్, రాయల్ టాకిస్ చౌరస్తాల్లో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు జాతీయ నేతల వేషధారణతో వాహనదారులను కలిసి హెల్మెట్, సీటు బెల్ట్‌లను కచ్చితంగా ధరించాలని కోరుతూ పువ్వులను అందజేశారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ కరిష్మా, ఉపాధ్యాయులు హరిక సంధ్యా, లావణ్య, సాయి ప్రసన్న, ఉదయకీర్తన, శివకుమారి, స్రవంతి, రూబినా, అనుషా ప్రియాంక, రమా పాల్గొన్నారు.

ఉద్యమకారులకు అండగా ప్రభుత్వం

మందమర్రిటౌన్, జనవరి 24 : స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమం చేసిన ఉద్యమకారులకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీలో ఓయూ జేఏసీ, తెలంగాణ జేఏసీ, విద్యార్థి ఉద్యమ నాయకులు నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యేను నాయకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌యాదవ్, శ్వేత, శ్రీనివాస్, వెన్నెల, ప్రొఫెసర్ ప్రేమయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

హాజీపూర్, జనవరి 24: మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన బైకం కీర్తన (18) హైదరాబాద్‌లోని చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై నరేష్‌కుమార్‌తెలిపారు. కీర్తన మంచిర్యాలలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. కొంత కాలంగా కీర్తన సెల్‌ఫోన్, టీవీ చూస్తూ చదువుపై దృష్టి సారించడం లేదని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన కీర్తన మంగళ వారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. కుటుంబీకులు చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య

తాండూర్, జనవరి 24: తాండూర్ పంచాయతీ పరిధిలోని వాల్మీకినగర్‌కు చెందిన అబ్బర్ల రాజ్‌కుమార్ (20) అనే యువకుడు బావిలో దూకి ఆత్మహత్యచేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్‌కుమార్ తల్లి దేవక్క నాలుగేళ్ల క్రితం మృతి చెందింది. తండ్రి రాజమల్లు 9 నెలల క్రితం ఆత్మహత్యచేసుకున్నాడు. దీంతో రాజ్‌కుమార్ మానసికంగా కృంగిపోయి మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది బుధవారం సాయంత్రం వాల్మీకినగర్ లోని పాడుబడిన బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. రాజ్‌కుమార్ నానమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

జన్నారం, జనవరి 24: రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మండలంలోని ఇందన్‌పల్లి, కవ్వాల్, జన్నారం గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాలను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం

బెల్లంపల్లి, జనవరి 24: విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటాలు చేస్తుందని విభాగ్ కన్వీనర్ అజయ్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలో ఏబీవీపీ నూతన నగర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నగర కార్య దర్శిగా సూర్య, సంయుక్త కార్యదర్శులుగా అరుణ్, హేమంత్, కార్తీక్, బాలాజీ, నగర ఇన్‌చార్జీగా ఆకాష్, సంతోష్, సోషల్ మీడియా ఇన్‌చార్జీగా నితిన్, విక్రమ్ తేజ్, కార్యవర్గసభ్యులుగా అశోక్, సాయి, వివేక్, శ్రావణి, శ్రావ్యలను ఎన్నుకు న్నారు. కార్యక్రమంలో దీపక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

వేమనపల్లి, జనవరి 24: వేమనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బు . దవారం ఎంపీపీ కోలి స్వర్ణలత అధ్యక్షతన అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన కోసం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 13, 49,780 పనులకు ప్రతిపాదించి ఆమోదించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ ఆత్రం గణపతి, ఎంపీటీసీలు బాపు, కో ఆప్షన్ సభ్యుడు జాహెద్‌అలీ, ఎంఈవో తిరుపతిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌ఏఈ నరేష్, ఏపీవో సత్యప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

నెన్నెల, జనవరి 24: మండలంలోని చిత్తాపూర్‌లో నిర్వహించిన రైతుమిత్ర క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మాలగురిజాల జట్టును ఓడించి చిత్తాపూర్ జట్టు చాంపియన్‌షిప్ దక్కించుకుంది. విజేతకు మండల వ్యవసాయ అధికారి ప్రేమ్‌కుమార్ చేతుల మీదుగా కప్పు అందజేశారు. కార్యక్రమంలో ఓరెం మల్ల య్య టోర్నీ నిర్వాహకులు తోట మహేష్, ఎంబడి సురేష్, సతీష్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు

హాజీపూర్, జనవరి 24: మండలంలోని బుద్దిపల్లి గ్రామంలో విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. కొండాపూర్, బుద్దిపల్లి గ్రామాలకు చెందిన నాలుగు టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి మ్యాచ్‌లో కొండాపూర్ జట్టు గెలవగా, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బుద్దిపల్లి జట్టు గెలిచింది. విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేయనున్నట్లు టోర్నీ నిర్వాహకులు తెలిపారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

జైపూర్, జనవరి 2: జైపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో అక్రమంగా నిర్మించిన వెంచర్లపై చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ మేడి సునీత బుధవారం అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతి పత్రం అందజేశారు. కొందరు అనుమతులు లేకుండా అక్రమ వెంచర్లను ఏర్పాటు చేసి ప్రజలను మోసం చేస్తున్నారని వివరించారు. వెంటనే అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్య

మందమర్రిటౌన్, జనవరి 24: తెలంగాణ గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని మంజునాధ గార్డెన్‌లో టీజీపీఏ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఉపేందర్, ఉపాధ్యక్షుడిగా సతీష్, కోశాధికారిగా పోచయ్య, సంయుక్త కార్యదర్శిగా శంకర్, లావణ్య, రామస్వామి, కార్యనిర్వహణ కార్యదర్శు లుగా లక్ష్మణ్, సంపత్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్ర మంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేష్ , రాష్ట్ర ఉపాధ్య క్షుడు దార మధు, మహిళ కన్వీనర్ ఉప్పులేటి గోపిక, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం పాటించాలి

జన్నారం, జనవరి 24: హైకోర్టులో కొత్తగా నియమించే జీపీ, ఏజీపీ నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలని హైకోర్టు మాజీ ఏజీపీ, న్యాయవాది రత్నం రాజేష్ నెహత బుధవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇప్పటి వరకు నేతకానిలు ఏ రాజకీయ పార్టీ సరైన అవకాశం కల్పించలేదని తెలిపారు. త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేయనున్న కార్పొరేషన్ పదవుల్లో నేతకాని కులస్తులకు ప్రాధాన్యత కల్పించాలని విన్నవించారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

ఏసీసీ, జనవరి 24: జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో బుధవారం జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి అర్పితరెడ్డి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్ర మంలో లీగల్‌హెడ్ కౌన్సిల్ సభ్యులు సందాని, తాజుద్దీన్, సదయ్య, రాములు, న్యాయవాదులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కేజియారాణి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

సర్వే పనులు అడ్డగింత

కాసిపేట, జనవరి 24: కళ్యాణిఖని మెగా ఓసీపీలో ముంపునకు గురవుతున్న దుబ్బగూడెంలో ఎలాంటి సమాచారం లేకుండా బుధవారం సర్వే చేపడుతున్న అధికారులను నిర్వాసితులు అడ్డుకుని నిరసన తెలిపారు. రెవెన్యూ, సింగరేణి అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

వైభవంగా ఎల్లమ్మ బోనాలు

దండేపల్లి, జనవరి 24: మండలంలోని నాగసముద్రంలో రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎల్లమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. గీత కార్మికులు ఆలయ సమీపంలోని వనంలో తాటిచెట్టుపైకి పలువురు మోకులతో ఎక్కి కల్లు తీసుకువచ్చి నైవేద్యం సమ ర్పించారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎల్లమ్మ తల్లిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

- అదనపు కలెక్టర్ రాహుల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 24: బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలు అదిరోహించాలని, అందరికి ఆదర్శంగా నిలువాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. జాతీయ బాలికల దినోత్స వాన్ని పురస్కరించుకుని బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, డీఆర్‌డీవో శేషాద్రి, డీఈవో యాదయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బాలికలను రక్షిద్దాం.. బాలిక లను చదివిద్దాం కార్యక్రమంలో భాగంగా బాలికల సంరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందన్నారు. బాలికలకు అవకాశం ఇస్తే అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తారని తెలిపారు. చదువులో బాలుర కంటే బాలికలు చక్కగా రాణిస్తున్నారని వివరించారు. బాలికల రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. అనంతరం పాఠశాలల్లో వాల్యూ ఆఫ్ గర్ల్‌చైల్డ్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బాలల పరిరక్షణ సమితి చైర్మన్ వాహిద్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లక్సెటిపేట రూరల్: బాలికల రక్షణ కోసం భారత రాజ్యాంగం ఆధారంగా ప్రత్యేక చట్టాలు రూపొందించారని జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. లక్సెటిపేట పట్టణంలోని స్థానిక బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం స్థానిక కోర్టు ఆవరణలో ఉన్న మండల న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కారు కూరి సురేందర్ న్యాయవాదులు కేతిరెడ్డి భూమరెడ్డి నళినికాంత్ వేల్పుల సత్యం రెడ్డిమల్ల ప్రకాశం గణేష్‌వర్మ వినీత కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్: నస్పూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మహిళా సాధికారత, ఆడపిల్లల విద్యా, ఆరోగ్యం, స్వీయ రక్షణపై అవగాహన కల్పించారు. జాతీయ బాలిక దినోత్సవం బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సమత విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కస్తూర్బా బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

జైపూర్: బాలికలు ఉన్నత చదువుపై దృష్టి సారించాలని మహిళ తరంగిణి సొసైటీ అధ్యక్షురాలు శ్రీదేవి అన్నారు. బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని ముదిగుంట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసంమూడు సైకిళ్లను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గిన్నిస్‌బుక్ రికార్డు గ్రహీత డాక్టర్ చిదానందకుమారి, సొసైటి ఆర్గనైజర్ సెక్రటరీ పద్మ, ట్రెజరర్ జ్యోత్స్న, సభ్యురాలు నాగమణి, సర్పంచు దుగుట జ్యోతి, ప్రధానోపాధ్యాయుడు రాజగోపాల్, ఉపాధ్యాయులు కల్పన, కిరణ్మయి, పవన్, సురేందర్, రాజన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటపల్లి: మండలంలోని బావనపల్లి ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమక్షంలో ఆడపిల్లల ఆశీర్వాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బొలిశె ట్టి బుచ్చన్న ఉపాధ్యాయుడు గంగాధర్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తహీనతను నివారించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 24: రక్తహీనతను నివారించేందుకు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సాయికుంటలో గల గిరిజన పాఠశాలలో బుధవారం ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడుతో కలిసి ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మాత్రలను వేశారు. వైద్యులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీటీడీవో గంగారాం, ప్రోగ్రాం అధికారి అనిత, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయనిర్మల, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, వైద్యులు రామకృష్ణ, రజిత, పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, వార్డెన్‌లు మల్లారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రవెల్లిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

బెల్లంపల్లి, జనవరి 24: మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమపథకాలను ప్రచార రథంలోని ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా వీడియోలను ప్రజలకు చూపించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం ప్రధాని మోదీ అనేక పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం కేంద్ర పథకాల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ జాడి నాందేవ్, సీఎఫ్ఐ రాజ్‌కుమార్, రాహుల్, కార్యదర్శి ప్రశాంత్, ఏఎన్‌ఎం ధనలక్ష్మీ, ఆశా కార్యకర్త మమత, నగలక్ష్మీ, డ్రోన్ డెమో నిర్వహకులు జుబేరియా, పైలట్ ఆదిత్య, గ్యాస్‌ఆపరేటర్ క్రాంతి, మహేందర్, రాజిరెడ్డి, రాజ్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజేందర్

మందమర్రిరూరల్, జనవరి 24: బీజేపీ మండల అధ్యక్షుడిగా సుంకరి రాజేందర్ నియమితులయ్యారు. బుధవారం జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆరుముళ్ల పోశం, దుర్గం అశోక్, వెంకటేష్, రమేష్, దీక్షితులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

ఏసీసీ, జనవరి 24: బాలికల సంక్షేమం, రక్షణ, రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలు కోసం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయించాలని వనితావాక్కు ఫౌండర్ ప్రెసిడెంట్ రంగు వేణుకుమార్ కోరారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌కు బుధవారం హైదరాబాద్‌లో వనితా వాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కో ఫౌండర్‌లు తాళ్లపల్లి కవిత, కుర్మ సునీత, రంగు నవీత, డాక్టర్ అన్నపూర్ణ, కాశబోయిన ఉష, రాచకొండ చందన పాల్గొన్నారు.

రసాభాసగా మండల సమావేశం

- సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీపీ గడ్డం శ్రీనివాస్

దండేపల్లి, జనవరి 24: దండేపల్లి మండల పరిషత్ కార్యయలంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా కొనసాగింది. పలు సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. ఈసందర్భంగా గొర్రెల పంపిణీకి సంబంధించిన సమాచారం ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలకు ఇవ్వడం లేదని పశువైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్‌ను ఎంపీటీసీ సభ్యులు ముత్యాల శ్రీనివాస్, బొడు కమలాకర్, ముత్తె రాజన్న, కొంగల నవీన్, తోట మోహన్ ప్రశ్నిం చారు. యాదవ్‌లు గొర్రెల కోసం డీడీలు కట్టి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పంపిణీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకెప్పుడు పంపిణీ చేస్తారంటూ సభ్యులు అధికారిపై మండిపడ్డారు. లేకుంటే గొర్రెల కోసం కట్టిన డీడీలను వెంటనే లబ్ధిదారులకు వాపసు చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు సరైన మందులు ఇవ్వడం లేదని కర్ణపేట సర్పంచు రాజేశ్వరీ వైద్యాధికారులు డాక్టర్ సతీష్ కాంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆసుపత్రిలో వైద్యసిబ్బంది నిర్లక్ష్యంతో ప్రజలకు వైద్యంపై నమ్మకం పోయిందని సభ్యులు రాజన్న, శ్రీనివాస్, నవీన్‌లు వైద్యాధికారులపై మండిపడ్డారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికా రులు సభ్యులు ప్రస్తావించిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గడ్డం నాగలక్ష్మి, ఎంపీ డీవో మల్లేషం, తహసీల్దార్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

మంద మర్రి టౌన్, జనవరి 24 : ఏరియాలోని కేకే 5 గనిపై బుధవారం రోడ్డు పను లు ప్రారంభ మయ్యాయి. రోడ్డు దెబ్బతినడంతో కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని గుర్తింపు సంఘం నాయకులు సివిల్ అధి కారుల దృష్టికి తీసుకెళ్లడంతో పనులను ప్రారంభించారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

తాండూర్, జనవరి 24: గ్రామాల్లో వంద శాతం ప న్నులను వసూలు చేయాలని బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి ఫణీందర్‌రావు సూచించారు. బుధవారం రేచిని గ్రామంలో పర్యటించారు. పారిశుధ్య, నర్సరీ పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి





అన్ని వార్డులకు నీటి సరఫరా


ఏసీసీ, జనవరి 24: మంచిర్యాల మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు ప్రతీ రోజు నల్లాల ద్వారా మంచినీటి సరఫరా చేస్తామని కమిషనర్ మారుతి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వాయర్‌లకు సంబంధించిన ఏరియాలు డివైడ్ చేయడం వల్ల వార్డు నంబరు 24, 25, 26, 27లలో నీరు తక్కువగా ఉన్నందున సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. కాలేజీ రోడ్డు ఏరియాలో పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్నందున ఇబ్బందులు ఉన్నాయని, త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


● ఓ మహిళ కారణమని మృతదేహంతో కుటుంబీకుల ఆందోళన


సల్మాన్(ఫైల్))

ఏసీసీ, జనవరి 24: జిల్లా కేంద్రంలో మన స్తాపంతో ఓయువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ఓ మహిళే కారణమని మృతదేహంతో ఆమె ఇంటి ఎదుట బంధువులు ఆందోళన చేప ట్టారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అశోక్‌రోడ్డుకు చెందిన మహ్మద్ సల్మాన్(30) బట్టల షాపులో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళతో కొంత కాలంగా చనువుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 22న మంచిర్యాల నుంచి బస్సులో బయలుదేరి గోదావరిఖని బస్టాండ్‌కు చేరుకున్నాడు. అక్కడ పురుగుల మందు తాగి సెల్‌ఫోన్ ద్వారా కుటుంబీకులకు సమాచారం అందించాడు. అపస్మారక స్థితిలో ఉన్న సల్మాన్‌ను గమనించిన స్థానికులు 108కు సమా చారం అందించారు. అంబులెన్స్‌లో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు వరంగల్‌లోని ఎంజీఎంలో చేర్పిం చారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. సల్మాన్ మృతికి సదరు మహిళ కారణమని ఆరోపిస్తూ కుటుంబీకులు మృతదేహంతో ఆమె ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తల్లి, కుటుంబ సభ్యులు మాట్లాడుతూ 8 సంవత్సరాల నుంచి భర్తకు దూరమైన సదరు మహిళతో సల్మాన్ చనువుగా ఉంటున్నాడన్నారు. మహిళ తనకు అవసరం ఉందని గతంలో సల్మాన్ నుంచి రూ. 4 లక్షలు తీసుకుందని, మళ్లీ రూ. 2 లక్షలు ఇవ్వాలని , ఇవ్వకుంటే విషం తాగి చనిపోతానని బెదిరించిందన్నారు. మహిళ వేధింపుల వల్లనే ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. పోలీసులు న్యాయం చేయాలని కోరారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సల్మాన్ కుటుంబ సభ్యులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని, ఆందోళన విరమించాలని కోరారు. దీంతో మృతదేహాన్ని తీసుకుని సల్మాన్ కుటుంబీకులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై స్వామి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.
















'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటుచేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావో‌స్‌లో వచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై


బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమొచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?


- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని


గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాములవారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్థక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్టు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



'పది' విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి

ఆసిఫాబాద్, జనవరి 24: పదవతరగతి వార్షికపరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఈవో అశోక్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవితో కలిసి ఎంఈవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పదవతరగతి వార్షిక పరీక్షలలో విద్యార్థులు చక్కటిఉత్తీర్ణత సాధించాలన్నారు. అందుకు అధికారుల సమష్టి కృషిచేయాలన్నారు. గతసంవత్సరం పదిలో 76శాతంతో రాష్ట్రంలో 4వస్థానం నిలవడం అభినందనీయమన్నారు. ఈసారి మొదటిస్థానం వచ్చేలా కృషి చేయాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

నేరస్థులకు శిక్ష పడేలా చూడాలి: ఎస్పీ సురేష్‌కుమార్



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, జనవరి 24: నేరస్తులకు శిక్షపడేలా చూడాలని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో పోలీసుఅధికారులతో శాంతిభద్రతలపై ఆయన నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పరిశోధనతో సమగ్రవిచారణ చేపట్టి నేరస్తులకు శిక్షపడేలా చూడాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపట్ల గౌరవంగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం సీఐలురాజు,సాదిక్‌పాషా,ఎస్సైలు ప్రవీణ్,దీకొండరమేష్, సాగర్, కానిస్టేబుళ్లు బాపురావు, సత్యనారాయణ, అజీముద్దీన్, పూల్‌సింగ్, ఉమేష్, నజాత్‌ఆలాంకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు, డీఎస్పీలు కరుణాకర్, రమేష్, సీఐలు రాణాప్రతాప్, రమేష్‌పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేద్దాం..

రోడ్డు ప్రమాదాల నివారణ పోసులుశాఖ, రోడ్డు రవాణాశాఖ సమన్వయంతో పని చేద్దామని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల వాల్‌పోస్టర్లను, కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వవిభాగాల సమన్వయంతోపాటు ప్రజల సహకారంతో రోడ్డు ప్రమాదాల నివారణకు పని చేద్దామన్నారు. ఈనెల15 నుంచి ఫిబ్రవరి 14వరకునిర్వహించే జాతీయరోడ్డుభద్రత మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. రోడు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. జిల్లా ట్రాన్స్ పోర్టు ఆఫీసర్ గందం లక్ష్మి రోడ్డుప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు అవగాహన కల్పించారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు, మోటారువెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వ రరావు, సంతోష్‌కుమార్, డీఎస్పీలు కరుణాకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

వాంకిడి, జనవరి 24: అగ్నిప్రమాదాలపై ప్రతిఒక్కరూ అగాహన కలిగి ఉండాలని అగ్నిమాపకశాఖ అధికారి సతీష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ కళాశాలలో అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు, అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఫైర్‌ఫైటింగ్ ఎక్విప్మెంట్ ఉపయోగించి ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మహిళలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆలోచనత్మకంగా వ్యవహరించి ప్రమాదాలనివారణకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఐఈవో శంకర్, ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రయ్య, అధ్యాపకులు సురేందర్‌కుమార్, సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్, తిరుపతి, సత్యం, అశ్విని, శ్రీకాంత్, సంతోష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు మెయింటేన్ చేయాలి

● జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్

కౌటాల, జనవరి 24: ఎరువుల విక్రయదారులు రికార్డులు మెయింటేన్ చేయాలని జిల్లావ్యవసాయాధికారి ఆర్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా స్టాక్‌రిజిస్టర్లతోపాటు ఎరువులు, పురుగులమందులను పరిశీలించారు. టీపీఎస్ ద్వారానే ఎరువులవిక్రయాలు జరపాలన్నారు. అలాగే వ్యవసాయాధికారులు కూడా ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలన్నారు. వ్యవసాయదారులు ఎలాంటి ఇబ్బందులున్నా వ్యవసాయశాఖ కార్యాలయంలో కానీ, ఏఈవోలను కానీ సంప్రదించాలన్నారు.

సంక్షిప్త సమాచారం..

ఆసిఫాబాద్: బెల్టుషాపులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ వాంకిడి మండలం గోయగాం గ్రామానికిచెందిన మహిళలు బుధవారం జిల్లా ఎక్సైజ్‌శాఖ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు.

ఆసిఫాబాద్ రూరల్: పిల్లల్లో పఠన సంస్కృతిని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రూం టు రీడ్ వారి సహకారంతో తెలుగు భాషలో జిల్లా స్థాయి రీడథాన్(పఠనపోటీ)లు బుధవారం నిర్వహించారు.

-జిల్లాకేంద్రంలో నూతనంగా నిర్మించిన అగ్రి లేఅవుట్ శిక్షణకేంద్రం, కమర్షియల్ కాంప్లెక్స్‌ను పీఏసీఎస్ ఛైర్మన్ అలీబీన్‌అహ్మద్, డీసీసీబీ జీఎం అనుపమ బుధవారం సందర్శించారు.

సిర్పూర్(యు): హైదరాబాదులో స్త్రీశిశుసంక్షేమ, పంచాయత్‌రాజ్, దేవాదాయ శాఖ మంత్రులు ధనసూరి అనసూయ, కొండ సురేఖను బుధవారం మండల వీటీడీఏ ఛైర్మన్ కుంర భీంరావ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

జైనూర్: మండలంలోని కొండాపటార్ కొలాం ఆదివాసీ గ్రామాల్లో మీసేవా నిర్వాహకులు ముబారక్ బుధవారం ఆధార్ అప్డేట్ నిర్వహించారు.

-మండలంలోని ఉషేగాం పరిధిలోగల గోందిపటార్, జంగాం, కోహ్కాగూడ, టింకాపెల్లి తదితర గ్రామాల్లో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఈవో రమేష్ ఇంటింటికి తిరిగి ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.

-జైనూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 2015-2016లో విధులు నిర్వర్తించిన అప్పటి సీడీపీవోపై ఐసీడీఎస్ అధికారులు వరంగల్ ఆర్జేడి జాన్సిలక్ష్మీ బాయి, నిజామాబాద్ అధికారుల బృందం బుధవారాల్లో కూడా విచారణ చేశారు.

-ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ జాతరకు రాకపోకలు నిర్వహించే భక్తుల కోసం అనక దేవేందర్ ఫౌండేషన్ అధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఉచితపూజ సామాగ్రి కరపత్రాలను విడుదల చేశారు.

-ఆదివాసులు కొంగు బంగారాం నాగ దేవత మహా పూజకు గంగాజల సేకరణ కోసం బయ లుదేరిన మేస్రం వంశీయుల పాద యాత్ర బుధ వారం జైనూరు మండలం లోని లేండిజాలకు చేరుకుంది.

చింతలమానేపల్లి: మండలంలోని కర్జవెల్లి, రుద్రాపూర్ గ్రామశివారు లోని పంటపొలాల్లో యాసంగి పంటల వివరాలను బుధవారం ఏఈవో విజయ్ సందర్శించి నమోదు చేశారు.


-జాతీయఓటరు దినోత్సవాన్ని ఈనెల25న ఘనంగా నిర్వహించాలని తహసీల్దార్ నాగరాజు గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సిర్పూర్(యు): మండలకేంద్రంలోని ప్రెసిడెంట్ గూడలో సిర్రూర్ కార్ ఆత్రం వంశీయుల పెద్దదేవుడి ఊరేగింపుతోపాటు, ఖాతిగూడలో చాందేకర్ ఆత్రంవంశీయులు పెర్సపేన్ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.

కౌటాల: మండలంలోని గురుడుపేట గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు.

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్‌లోని పలుహోటళ్లు, బార్‌అండ్‌రెస్టారెంట్‌లలో అక్రమంగా వినియోగిస్తున్న సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను రెవెన్యూఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. పట్టణంలోని పలు హోటళ్లు, దుకాణాలలో దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 18ఎల్‌పీజీసిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్‌దార్లు శ్యాంలాల్, రాజ్‌కుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలి



బస్సులను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, కలెక్టర్, ఎమ్మెల్యే

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 24: ఆర్టీసీ బస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు, కలెక్టర్ హేమంత్, ఎస్పీ సురేష్‌కుమార్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లాకేంద్రంలోని డిపో పరిధిలో అందు బాటులోకి వచ్చిన లహరి, రాజధాని ఎక్స్‌ప్రెస్ సర్వీసులను డిపో మేనేజర్ శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రస్తుతం అనేక సేవలు అందుబాటులోకి వచ్చాయని ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంనాయక్, అలీబీన్ అహ్మద్, సాయినాథ్, సతీష్‌పాల్గొన్నారు.

కొత్త ప్రభుత్వమైనా మంజూరు చేసేనా?

● సబ్సిడీపై వ్యవసాయ పరికరాల కోసం నిరీక్షణ
● ఆరేళ్లుగా నిలిచిన పంపిణీ ● రైతులకు తప్పనితిప్పలు





ఆసిఫాబాద్, జనవరి 24: ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో వ్యవసాయ యాంత్రీకరణ లక్ష్యం నెరవేరడం లేదు. గ్రామాల్లో దుక్కిటెడ్ల స్థానాన్ని ట్రాక్టర్లు ఆక్రమించాయి. వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వాడకం పెంచేందుకు గత ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకాన్ని ప్రవేశపట్టింది. కానీ ఆరేళ్లుగా ఈ పథకం అమలు కావడం లేదు. రైతులకు రైతుబంధు పథకం కింద పెట్టుబడి సాయం ఇస్తున్నామంటూ గత ప్రభుత్వం 2018 నుంచి ఇతర రాయితీలను రద్దు చేసింది. వ్యవసాయ కూలీల కొరత తీవ్రమవుతుండగా సాగుకు సాయంగా నిలిచే ఆధునిక యంత్రాలను రాయితీపై ఇవ్వక పోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పెట్రోల్, డీజిల్ రేట్లు పెరిగిపోవడంతో వ్యవసాయ యాంత్రాలకు అద్దెలు కూడా పెరిగి పోయాయి. దీంతో రైతులు చాలా అవస్థలు పడుతున్నారు.

పంటపై పెట్టిన పెట్టుబడి రాక రైతులు అప్పుల పాలవుతున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎంతో ఉపయోగకరమైన పని ముట్లను సబ్సిడీపై అందించాలని రైతులు ఎదురుచూస్తున్నారు.

రైతుల అవస్థలు..

కూలీల కొరతను అధిగమించడానికి యంత్రాలతో సాగు చేయడానికి రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయాధి కారులు సదస్సులు నిర్వహిస్తున్నారు. కానీ రైతులను ప్రోత్సహించడానికి మాత్రం ముందుకు రావడం లేదు. కూలీల కొరతతో సీజన్‌లో అధిక కూలీ ఇవ్వాల్సి రావడంతో సాగు ఖర్చు పెరుగుతోంది. పెట్టిన పెట్టుబడి రాక రైతులు అప్పుల పాలవుతున్నారు. రైతులకు ఎంతో ఉపయోగకరమైన సబ్సిడీ పనిముట్లను అందించక పోవడంతో రైతులకు సాగు భారం తడిసి మోపెడవుతోంది. ప్రతిరోజు వివిధ గ్రామాల రైతులు కార్యాలయం వద్దకు రావడం, సబ్సిడీ పనిముట్ల కోసం వాకబు చేస్తుండడం కనిపిస్తోంది. అవసరమైన వ్యవసాయ పని ముట్లు సబ్సిడీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

కొత్త ప్రభుత్వం దృష్టి సారించేనా..

గత ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకం ద్వారా రైతులకు ట్రాక్టర్లు, సాగు పరికరాలు, గొర్రులు, నాగళ్లు, డ్రమ్ సీడర్, రోటవేటర్లు, కల్టివేటర్లు, కేజీవీల్స్, హార్వెస్టర్లు, వరినాటు యంత్రాలను అందించింది. ఎస్సీ, ఎస్టీలకు 90శాతం, బీసీలకు 50శాతం రాయితీ వర్తింపజేశారు. ఇలా మూడేళ్లపాటు ఈ పథకం అమలు చేశాక 2018నుంచి నిలిపివేసింది. దీంతో రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారు. కాగా నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకాన్ని మళ్లీ ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

పరికరాలు అందించాలి..: సంతోష్, రైతు, ఆసిఫాబాద్



ఆరేళ్లుగా వ్యవసాయాంత్రీకరణకు సంబంధించిన పనిముట్లను సబ్సిడీపై ప్రభుత్వం అందించడం లేదు. దీంతో ప్రైవేటుగా అధిక ధరలు పెట్టి పని ముట్లను కొనుగోలు చేస్తున్నాం. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సహకారం అందించి రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

2018 వరకే వచ్చాయి..: ఖాదర్‌హుస్సేన్, ఏవో



గతంలో రాయితీపై వ్యవసాయ పరికరాలతో పాటు ట్రాక్టర్లను ప్రభుత్వం అందించేది. 2018 తర్వాత రాయితీపై ఎలాంటి పరికరాలు రాలేదు. రైతుల నుంచి డిమాండ్ ఉన్నమాట వాస్తవం. రైతుల విజ్ఞప్తులను ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

బాలికలు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

● కలెక్టర్ హేమంత్ బోర్కడే



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, జనవరి 24: బాలికలు విద్యతోపాటు క్రీడారంగంలో సైతం రాణించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. బుధవారం జాతీయ బాలికలదినోత్సవం పురస్కరంచుకుని స్త్రీశిశు వయోవృద్ధుల, దివ్యాంగులసంక్షేమశాఖ, జిల్లా మహిళాసాధికారత కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన జాతీయబాలికల దినోత్సవంలో ఆయన అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా సంక్షేమశాఖాధికారి సావిత్రితో కలిసి హాజరయ్యారు. ఆడపిల్లలను కాపాడుకోవాలన్నారు. ఆడపిల్లలు వద్దు అనుకుంటే రేపటి సమాజం అమ్మలేని అనాథ అవుతుందన్నారు. బాలికలు, మహిళలసంక్షేమం కోసం బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాన్ని అన్నిశాఖల అధికారులు సమన్వయంతో అమలు చేయాలన్నారు. అనంతరం క్విజ్,వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులుకు బహుమతులు ప్రదానంచేశారు. కార్యక్రమంలో గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి,ఆరోగ్యశాఖఅధికారి తుకారం భట్, జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, జీసీడీవో శకుంతల, మహిళా సాధికారత కేంద్రంసభ్యులు శారద, మమత, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆసిఫాబాద్ రూరల్: తెలంగాణ అగ్రివైద్యుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను బుధవారం కలెక్టర్ హేమంత్ బోర్కడే ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, తిరుమలేశ్వర్, ఖాదర్‌హుస్సేన్, రాజుల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి కేసులో.. ఒకరి అరెస్టు

వాంకిడి, జనవరి 24:కెరమెరి మండలం ధనోర కోలాంగూడ గ్రామ సమీప అటవీప్రాంతంలో వన్యప్రాణులను వేటా డేందుకు అమర్చిన విద్యు త్‌తీగతగిలి ఒకరిమృతికి కారణమైన వ్యక్తిని బుధ వారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించి నట్లు వాంకిడి సీఐ శ్రీనివాస్ తెలిపారు. వాంకిడి పోలీసుస్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. కెరమెరి మండలం దనోర కోలాంగూడ గ్రామానికి చెందిన సిడాం కట్టి సోమవారం సాయంత్రం6గంటల ప్రాంతంలో సిడాం భీము ఇంటికి వచ్చాడు. భీం ఇంట్లో లేకపోవడంతో రాత్రి వేటకు వెళ్లేందుకు మీభర్త భీమును రెడీగా ఉండమని భీము భార్య భీంబాయికి చెప్పి వెళ్లాడు. రాత్రి 9గంటలకు కట్టి చెప్పిన ప్రాంతానికి భీము వెళ్లాడు. అప్పటికే అక్కడ విద్యుత్‌తీగలు అమర్చి ఉన్నాయి. గమనించని భీము దానిని తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య భీంబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కట్టిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలి పారు.

బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె యువరాజా

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 24: బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్‌జడ్జి కె యువరాజా అన్నారు. బుధవారం జాతీయ బాలికలదినోత్సవం పురస్కరించుకుని ఆసిఫాబాద్‌పట్టణంలోని గిరిజన బాలికల గురుకులపాఠశాలలో ఏర్పాటుచేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయనపాల్గొని మాట్లాడారు. ప్రతిసంవత్సరం జాతీయ బాలికల దినోత్సవాన్ని జరుపుకోవడం ప్రధానంగా మూడులక్ష్యాలను కలిగిఉందని తెలిపారు. దేశంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమాన తలను ఎత్తి చూపడం, బాలికలు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, బాలికా విద్య, ఆరోగ్య, పోషక ఆహారం ప్రాముఖ్యతపై వివరించారు. అనంతరం పాఠశాలలో వంటగది, ఆవరణ, సరుకులు పరిశీలించి శుభ్రమైన ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్‌ఎయిడ్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లీగల్‌ఎయిడ్ అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

కుమరం భీం ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తాం: ఎమ్మెల్యే హరీష్‌బాబు



భీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్

బెజ్జూరు, జనవరి 24: కుమరం భీం ఆశయ సాధనకు అనుగుణంగా పనిచేస్తామని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని బస్టాండుఆవరణలో కుమరంభీం విగ్రహాన్ని జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు అందుబాటులో ఉండి పనిచేస్తామని పేర్కొన్నారు. ఆదివాసీ గిరిజనులకు ఆసరాగా ఉండే ఐటీడీఏ పాలకులు పూర్తి నిర్వీర్యం చేయడంతో అభివృద్ధి ఫలాలు వారికి అందడ లేదన్నారు. ఐటీడీఏను తిరిగి పునరుద్ధరించి అభివృద్ధి ఫలాలు గిరిజనులకు అందేలా కృషిచేస్తామన్నారు. ఐటీడీఏ పీవోను ప్రతి మూడు నెలలకోసారి మారు మూల గ్రామాలకు తీసుకు వచ్చి ప్రజాదర్బార్ ఏర్పాటు చేసి గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామ న్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్‌ఛైర్మన్ మాంతయ్య, జడ్పీటీసీ పుష్పలత, సర్పంచ్ అన్సర్ హుస్సేన్, పీఏసీఎస్ ఛైర్మన్ ఓంప్రకాష్, గణపతి, బ్రహ్మయ్య, వంకర్, సకారాం, చిన్నయ్య, లక్ష్మణ్, భిక్షమయ్య, పోశాలు, వెంకటేశ్వర్, తిరు పతి,సతీష్,జావీద్, తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి ఉత్తమ ఉద్యోగులు వీరే

శ్రీరాంపూర్, జనవరి 24: శ్రీరాంపూర్ ఏరియాలో ఉత్తమ ఉద్యోగుల జాబితాను సింగరేణి అధికారులు విడుదల చేశారు. ఏరియా నుంచి ఉత్తమ సింగరేణియన్‌గా ఎం మధుకర్(కోల్ కట్టర్-ఇందారం1ఎ), ఉత్తమఅధికారిగా ఎన్నపురెడ్డి సంపత్‌రెడ్డి (డిప్యూటీ ఎస్ఎస్‌వో-శ్రీరాంపూర్ ఓసీపీ) ఎన్నికయ్యారు. వీరు ఈనెల26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలోని ప్రకాశంస్టేడియంలో సన్మానం అదుకోనున్నారు. అలాగే ఏరియా ఉత్తమ ఉద్యోగులుగా ఆర్‌కె5గని నుంచి లక్కెట్టి మహేష్, ఆడెపు ధనుంజయ్, ఆర్‌కె6 గని నుంచి కె వంశీకృష్ణ, జక్కుల ఎర్రన్న, ఆర్‌కె7 గనినుంచి ఓరుగంటి బ్రహ్మయ్య, సంఘం శివకుమార్, ఆర్‌కె న్యూటెక్ గని నుంచి కె రాజయ్య, కె సత్తయ్య, ఎస్ఆర్‌పి1 గని నుంచి కె దేవానందం, సి తిరుపతి, ఎస్ఆర్‌పి3,3ఎ గని నుంచి ఎ రాజమల్లు, బి సతీష్‌కుమార్, ఇందారం 1ఎ గని నుంచి కె శ్యామ్‌కుమార్, కె రమేష్, ఇందారం ఓసీపీ నుంచి బి శ్రీనివాస్, జెమధు, శ్రీరాంపూర్ ఓసీపీ నుంచి ఎస్ భాస్కర్‌రావు, ఎస్ దేవానంద్ ఎన్నికయ్యారు. వీరిని ఈనెల26న శ్రీరాంపూర్ జీఎం బి సంజీవరెడ్డి అవార్డు అందించి, సన్మానించనున్నారు.

మందమర్రి టౌన్: మందమర్రి ఏరియా ఉత్తమ కార్మికులను యాజమాన్యం ఎంపిక చేసింది. ఈ మేరకు ఎంపికైన కార్మికుల వివరాలను పీఎం శ్యాంసుందర్ బుధవారం వెల్లడించారు. కాసిపేట గనిలో కోల్‌కట్టర్‌గా పనిచేస్తున్న ఎనగందుల వెంకటరాజం(కాసిపేట1) ఎలక్ట్రీషియన్ పల్లె అంజిరెడ్డి (కాసిపేట1), కోల్‌కట్టర్ ఎంబడి అంజయ్య(కేకే5),ఎస్‌డీఎల్ ఆపరేటర్ వెంగల రాజన్న (కేకే5), పిట్టర్ ఆవుల మహేష్(శాంతిఖని), హెడ్ ఓవర్‌మెన్ మహ్మద్ అమీర్‌ఖాన్(శాంతిఖని), హెడ్ ఓవర్‌మెన్ సురేష్(ఆర్కేపీ ఓసీ), జనరల్ మజ్దూర్ ధర్మేందర్ (ఆర్కే ఓసీ) ఈపీ ఆపరేటర్ మైలాల విజయ్‌కుమార్ (కేకే ఓసీ), సల్లం మహేష్, జనరల్ మజ్దూర్ (కేకే ఓసీ), కల్వచర్ల శ్రీనివాస్, కోల్‌కటర్(కాసిపేట2), కనకంరమేష్ హెల్పర్ (కాసిపేట2)లు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ఈనెల26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సింగరేణిపాఠశాల మైదానంలో సన్మానిస్తామన్నారు.

ఉత్తమ అధికారిగా నాగరాజు..

మందమర్రి ఏరియాలోని ఏజీఎం ఈఅండ్‌ఎంగా పనిచేస్తున్న జెనాగరాజు సింగరేణి ఉత్తమఅధికారిగా ఎంపికయ్యారు. ఈనెల26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ప్రకాషం స్టేడియంలో సీఎండీ చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు.

ఉత్తమ సింగరేణియన్‌గా సురేష్, జెస్సి రాజు



ఎం సురేష్ | జెస్సి రాజు

శ్రీరాంపూర్/ మందమర్రి టౌన్, జనవరి 24: సింగరేణి సంస్థ బెస్ట్ సింగరేణియన్‌గా హైదరాబాద్ సీఎండీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జీఎం కోఆర్డినేషన్ అధికారి సురేష్ ఎంపికయ్యారు. ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా సింగరేణి సీఎండీ బలరాం అవార్డు అందజేయనున్నారు. సింగరేణిలో అండర్‌మేనేజర్‌గా విధుల్లో చేరిన ఆయన అంచెలంచెలుగా జీఎంగా ఎదిగి ఏరియాల అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారు. మందమర్రి ఏరియాలోని కేకే5గనిమేనేజర్‌గా పనిచేసినకాలంలో రెండు జాతీయరక్షణ అవార్డులను సాధించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ప్రమాదరహిత ఉత్పత్తితో పాటు రికార్డుస్థాయిలో ఉత్పత్తి సాధించడంలో ప్రధానపాత్ర పోషించారు. శ్రీరాంపూర్, మణుగూరు జీఎంగా ఏరియాలను మొదటిస్థానంలో నిలిపిన పేరు కూడా సాధించారు. మార్చిలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఆయన ఈ అవార్డుకు ఎంపిక కావడంతో ఏరియాల జీఎంలతోపాటు ఇతర అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మందమర్రి టౌన్: మందమర్రి ఏరియాలోని కేకే5గనిలో ఎస్‌డీఎల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కుమ్మరి జెస్సిరాజ్ ఉత్తమ సింగరేణియన్‌గా ఎంపిక య్యాడు. ఈనెల26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలోని కార్యాలయంలో సింగరేణి సీఎండీ బలరాం ఆయనను అవార్డుతో సత్కరించనున్నారు. 2013లోబదిలీ పిల్లర్‌గా ఉద్యోగంలో చేరిన జెస్సిరాజ్ 2017గా ఏరియా ఉత్తమ కార్మికుడిగా ఎంపికయ్యారు.

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం: జీఎం

మందమర్రి టౌన్, జనవరి 24 : ఈనెల26న గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఏరియా జీఎం మనోహర్ అన్నారు. బుధవారం పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. వేడుకలను వీక్షించేందుకు వచ్చే కార్మికేతర, కార్మిక కుటుంబాలకు ఏర్పాట్లు చేస్తున్నామని, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ఆరు గ్యారంటీల బాధ్యత మాదే

● ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్

మందమర్రిటౌన్, జనవరి 24: కార్మికుల సంక్షేమంతో పాటు గుర్తింపుసంఘం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుబాధ్యత తమదేనని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్ అన్నారు. బుధవారం ఏరియాలోని కేకేఓసీపై ఏర్పాటుచేసిన యూనియన్ నూతనజెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజాభిప్రాయసేకరణ పూర్తయిన భూగర్భగనులన్నింటిని ఏర్పాటు చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్రకమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లిసమ్మయ్య, దేవిభూమయ్య, నూనె సాంబయ్య, మిట్టసూర్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత అభ్యర్థులకు ప్రాక్టికల్ పరీక్షలు

శ్రీరాంపూర్, జనవరి 24: మున్షీ, హెడ్ చైన్‌మన్, అసిస్టెంట్ చైన్‌మన్, డంప్‌మెన్/ట్రిప్‌మెన్ పదోన్నతుల కోసం శ్రీరాంపూర్ వృత్తిశిక్షణకేంద్రంలో పలువురు అంతర్గత అభ్యర్థులకు బుధవారం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభచూపిన వారికి పదోన్నతులు కల్పిస్తామని అధికారులు తెలిపారు.

ఆర్‌కె5 నూతన పిట్ కమిటీ

శ్రీరాంపూర్, జనవరి 24: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్‌కె5గని నూతన పిట్‌కమిటీని బుధవారం నియమించారు. పిట్‌కార్యదర్శిగా పృథ్వీ, అసిస్టెంట్ పిట్‌కార్యదర్శిగా శ్రావణ్, సలహాదారుగా దేవేందర్ సాయిలు, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జిగా అంజి, ఏ రిలే ఇన్‌చార్జిగా సుజిత్, బి రిలే ఇన్‌చార్జిగా శంకర్ నియమితులయ్యారు.

ఉద్యోగులకు పదోన్నతి పత్రాలు అందజేత

శ్రీరాంపూర్, జనవరి 24: శ్రీరాంపూర్ ఉపరితలగనిలో పనిచేస్తూ పదోన్నతులు పొందిన పలువురు ఉద్యోగులకు ప్రాజెక్ట్‌అధికారి పురుషోత్తమరెడ్డి పదోన్నతిపత్రాలు అందించారు. ప్రతి ఉద్యోగి రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బాజీ సైదా, ఇన్‌చార్జి మేనేజర్ శ్రీనివాస్,పిట్ కార్యదర్శి నల్లపుసత్తయ్య,అధికారుల సంఘం ప్రతినిధి శ్యామ్ సుందర్‌రావు, సీనియర్ పర్సనల్ అధికారి శంకర్ పాల్గొన్నారు.